ఆంధ్రజ్యోతి
5★
పెద్దపల్లి
జిల్లా వార్తలు
మంగళవారం 30 సెప్టెంబరు 2025







సరస్వతీదేవి అవతారంలో దుర్గామాత

మండపాల వద్ద అక్షరాభ్యాస పూజలు

సుల్తానాబాద్, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): దుర్గామాత మండపాల వద్ద సోమవారం సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 8వ రోజు సరస్వతి దేవి అమ్మవారి అవతారంలో కొలువై ఉంటున్న సందర్భాన్ని పురస్కరించుకుని కనుకులలో వేదపండితులు కాందూరి వాసు ఆధ్వర్యంలో చిన్నపిల్లలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, వారికి బుక్కులు, పెన్నులు అందించారు. పలువురికి అక్షరాభ్యాసాలు నిర్వహించారు. పూసాలలోని భక్తమార్కండేయ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేక అలంకరణతో చేసి అంశవాహినిగా, వీణవానిగా అలంకరించారు. ఆలయ చైర్మన్ వలస నీలయ్య, వలస భాస్కర్, వడ్నాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పూలతోటలుగా మారిన కూడళ్లు



ఓదెలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



గోదావరిఖని జవహర్‌నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పెద్దపల్లి కల్చరల్/మంథని, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలను సోమవారం రాత్రి మహిళలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంతో పాటు డివిజన్‌లోని పలు గ్రామాల్లో మహిళలు, యువతులు, పిల్లలు ఉదయం నుంచి పూలను సేకరించి గౌరమ్మలను పూజించి బతుకమ్మలను పేర్చారు. సాయంత్రం సద్దులబతుకమ్మ వేడుకలను ఆటాపాటలతో ఉత్సాహంగా నిర్వహించారు. గౌరమ్మను గుమ్మడి, కట్ల, తంగెడు, కలువ, సీతమ్మ జడలు, బంతి, ఛామంతి పూలతో పాటు గునుగ, టేకు పూలకు వివిధ రకాల రంగులు అద్ది ఒకరికంటే ఒకరు మహిళలు రంగు రంగుల పెద్ద, పెద్ద బతుకమ్మలను పేర్చి అర్ధరాత్రి వరకు డీజే సౌండ్స్ మధ్య వేడుకలు నిర్వహించారు. అనంతరం భాజాభ జంత్రీలతో చెరువు, వాగులు, కుంటలు, మానేరు, గోదావరి నదుల్లో నిమజ్జనం చేసి ఇస్తినమ్మ వాయినం.. పుచ్చుకుంటినమ్మ వాయినమంటూ తీపి పదార్థాలు పంచుకుంటూ నిమజ్జనం చేసి సాగనంపారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, పెండ్రి రమ, మాజీ జెడ్పీటీసీ తగరం సుమలత, మాజీ ఎంపీపీ ఏగోళపు కమల పట్టణంలోని పలు చోట్ల బతుకమ్మల వద్ద ఆడి పాడి సందడిచేశారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డిలు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని హనుమాన్ దేవాలయం, శివాలయం, అమర్‌నగర్, బాలాజీనగర్, కొంతంవాడ, ఎల్లమ్మ చెరువు మినీ ట్యాంక్ బండ్ వద్దకు బతుకమ్మలను తీసుకువెళ్ళారు. బతుకమ్మ పోయిరావమ్మా అంటూ తీరొక్క పాటలు పాడుతూ చెరువుల్లో మహిళలు నిమజ్జనం చేశారు. జెండా కూడలి నుండి ఎల్లమ్మ చెరువు వరకు బీజేపీ, ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.



పెద్దపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మరిన్ని వార్తలు 8లో...

గర్రెపల్లి చెరువు పర్యాటక కేంద్రంగా మార్చేందుకు కృషి



గర్రెపల్లి చెరువు వద్ద శివుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): గర్రెపల్లి చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. సోమవారం చెరువు వద్ద ఏర్పాటు చేసిన శివుని విగ్రహ ప్రతిష్ఠాపనతోపాటు బతుకమ్మ ఘాట్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు 16 లక్షలతో గర్రెపల్లి చెరువు వద్ద నిర్మించిన విగ్రహాలు అహ్లాదాన్ని అందించే విధంగా ఉన్నాయన్నారు. గ్రామంలో చక్కటి వాతావరణాన్ని నెలకొల్పి ప్రజలు సాయంకాలం వేళలో ఆనందంగా గడిపేందుకు కృషి చేసిన వారిని ఎమ్మెల్యే అభినందించారు. కన్నా రమేష్ గౌడ్ శివుడి విగ్రహాన్ని, బతుకమ్మ ఘాట్‌ను ఏర్పాటు చేసేందుకు దాతల సహకారంతో పూర్తి చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. విగ్రహాల నిర్మాణానికి సహకరించిన ఊరు పెద్దలు దాతలను ఎమ్మెల్యే సన్మానించారు. సమిండ్ల కిషన్ రావు దంపతులు, అమిరిశెట్టి రాధాకృష్ణ దంపతులతోపాటు రూ.2.50 లక్షలను అందించిన జూపల్లి తిరుమలరావును సన్మానించారు. గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'స్థానిక' సమరానికి మోగిన నగారా...

- వచ్చే నెల 9న నోటిఫికేషన్ జారీ
- రెండు విడతల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై 8వ తేదీన పూర్తి స్థాయిలో విచారించనుండడంతో ఆ మరుసటి రోజు 9వ తేదీ నుంచి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే విధంగా రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఆ వెంటనే కోడ్ అమల్లోకి వచ్చింది. మండల, జిల్లా పరిషత్ ఎన్నికల షెడ్యూల్‌ను ఒకేసారి విడుదల చేశారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహించనున్నారు. గ్రామ పంచా యతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించ నున్నారు. రెండు విడతల్లో నిర్వహించే మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను ఏ జిల్లాలో నిర్వహించినా ఒకే విడతలో నిర్వహించనున్నారు. మొదటి విడతలో కొన్ని జిల్లాలు, రెండో విడతలో మిగిలిన జిల్లాల్లో ఎన్నికలను నిర్వహించనున్నారు. జిల్లాలో 13 జడ్పీటీసీ స్థానాలు, 137 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. గ్రామ పంచాయ తీలు 263 ఉండగా, వార్డు స్థానాలు 2432 స్థానాలు ఉన్నాయి. వీటన్నింటికీ రిజర్వేషన్లను ఖరారు చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు 2024లో చేసిన కులగణన లెక్కల ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేశారు. సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారికంగా రిజర్వేషన్ల జాబితాలను విడుదల చేశారు.



● రెండు విడతల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు...

ఎంపీటీసీ, జడ్పీటీసీ మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ అక్టోబరు 9వ తేదీన జారీ కానున్నది. అదే రోజు నుంచి 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 12న పరిశీలన, 13 వరకు అభ్యంతరాలకు అవకాశం, 14న పరిష్కారం, నామినేషన్ల ఉపసంహరణకు 15 మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు విధించారు. 23న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు.

● రెండో విడత ఎన్నికల నోటిఫికేషన్ అక్టోబరు 13వ తేదీన జారీ కానున్నది. అదే రోజు నుంచి (మిగతా 8వ పేజీలో)







మూడు మద్యం షాపుల ఎత్తివేత

- ఖనిలో 20షాపులకు కొత్తగా రెండు సెక్టార్లు...
- సెక్టార్ పరిధిలో ఎక్కడైనా షాపు ఏర్పాటుకు అవకాశం...

కోల్‌సిటీ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సరైన వ్యాపారం సాగడం లేదనే కారణంగా మూడు మద్యం షాపులను ఎత్తివేశారు. గోదావరిఖనిలో రెండు, లైటింక్లయిన్‌కాలనీ ప్రాంతానికి చెందిన ఒక షాపును ఎత్తివేసి హైదరాబాద్ బాల్‌నగర్‌కు రెండు, కుద్బుల్లాపూర్‌కు ఒకటి కేటాయించారు. గతంలో 23 మద్యం షాపులు ఉండగా ఈ సారి 20షాపులకు కుదించారు. కార్పొరేషన్ పరిధిలోని 60డివిజన్లను రెండు సెక్టార్లుగా విభజించారు. 1వ సెక్టార్ 8షాపులు, 2వ సెక్టార్‌లో 12షాపులు పెట్టారు. ఒకటవ సెక్టార్ పరిధిలో 1 నుంచి 9డివిజన్లు, 24 నుంచి 37డివిజన్లు కేటాయించారు. రామగుండం పట్టణం, ఎన్‌టీపీసీ ఏరియా, గంగానగర్, బస్టాండ్ ఏరియా, హనుమాన్ తదితర ప్రాంతాలు ఈ సెక్టార్ పరిధిలోకి వస్తాయి. సెక్టార్-2లో 10వ డివిజన్ నుంచి 23వ డివిజన్, 38వ డివిజన్ నుంచి 60వ డివిజన్‌లను కేటాయించారు. రూ.65లక్షలు యేటా లైసెన్స్ ఫీజుగా నిర్ణయించారు. ఇందులో సెక్టార్-1 పరిధిలోని షాపు నెం.3, షాపు నెం.4, షాపు నెం.7ఎస్‌సీలకు కేటాయించగా, షాపు నెం.8 గౌడ్‌లకు కేటాయించారు. సెక్టార్-2 పరిధిలో షాపు నెం.2, షాపు నెం.4లను గౌడ్‌లకు కేటాయించారు. ప్రభుత్వం గతంలో ప్రకటించిన మద్యంపాలసీ లాభదాయకంగా ఉండడంతో కార్పొరేషన్ పరిధిలోని పలు షాపులు లాభాల బాటలో ఉన్నాయి. గతంలో కొందరు మద్యం వ్యాపారులు నష్టాలు వచ్చాయని భాగస్వాములకు తప్పుడు లెక్కలు చూపించడంతో వ్యాపారులు గొడవ పడడం, ఠాణాల్లో ఫిర్యాదులు చేసుకొనే ఘటనలు చోటు చేసుకున్నాయి. గోదావరిఖని పట్టణంలోని ఒక మద్యం దుకాణానికి సంబంధించి ఇప్పటికే ఠాణాలో భాగస్వాములు ఫిర్యాదుచేశారు. గోదావరిఖనిలో మూడు షాపులు తగ్గడం, ఎన్‌టీపీసీలో కొత్తగా యూనిట్లు మంజూరు కావడం, సమ్మక్క-సారలమ్మ జాతర, కార్పొరేషన్ ఎలక్షన్స్ దృష్టిలో ఉంచుకుని ఈసారి మద్యం షాపులకు పోటీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. మద్యం షాపులకు టెండర్లు దాఖలు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. అంతర్గాం, గోదావరిఖనిలోని 44 దరఖాస్తులు దాఖలయ్యాయి.



పోగొట్టుకున్న ఫోన్‌లు బాధితులకు అందజేత



బాధితులకు ఫోన్‌లను అప్పగిస్తున్న ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్ గౌడ్

తిమ్మాపూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆరునెలల క్రితం ఐదుగురు వ్యక్తులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కనుగొని సోమవారం బాధితులకు ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ అందజేశారు. మండలానికి చెందిన నూనె యశ్వంత్, తూర్పటి రిషిక్, దస్తగిరి నరసయ్య, కర్ర అంజనేయులు, తమ్మనవేని రాజుకు ఎస్సై వారు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌లను అప్పగించారు.

శంకరపట్నం: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు కేశవపట్నం ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి సోమవారం అందజేశారు. ఇటీవల సెల్‌ఫోన్లు పోయాయని బాధితులు దరఖాస్తులు ఇవ్వగా, సీఈఐఆర్ పోర్టల్‌లో వాటిని గుర్తించి బాధితులకు అప్పగించినట్లు తెలిపారు.

వారం రోజులుగా పొలాలకు కరెంటు బంద్

- సమాచారం ఇచ్చినా సరిచేయని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

గంగాధర, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు కొట్టివేయడంతో వారంరోజులుగా పొలాలకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ వారం రోజుల క్రితం ఉరుములకు మదర్ ఫీజు కొట్టివేసింది. రైతులు లైన్‌మెన్‌కు, ఏఈకి సమాచారం ఈ విషయం తెలియజేశారు. ఫీజువేస్తామని చెప్పి కనీసం అటువైపు కన్నెత్తి చూడటంలేదని రైతులు వాపోతున్నారు. వారం రోజులుగా గుర్తుచేస్తూనే ఉన్నారు. అయినా రేపు,మాపు వస్తామంటూ దాటవేస్తున్నారని రైతులు వాపోయారు. ప్రస్తుతం పొట్టదశలో ఉన్నవరికి ఎక్కువగా నీరు అవసరముంటదని సరైనసమయంలో నీరందక తీవ్రనష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు ఫీజువేసి విద్యుత్‌ను పునరుద్ధరించి పంటలను కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న సీఎం

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను సీఎం సాకారం చేస్తున్నారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. సోమవారం కరీంనగర్‌రూరల్ మండలం చెర్లబూత్కూర్‌లో ఇందిరమ్మఇళ్లు మంజూరైన 194మందికి ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దసరా కానుకగా కరీంనగర్ నియోజకవర్గానికి సీఎం 4వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇటీవల సీఎంని కలిసిన సమయంలో నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లను వెంటనే మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. స్థానికసంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేయాలని విజ్ఞప్తి చేశానన్నారు.

పల్లె దవాఖానాలు పూర్తయ్యేదెన్నడో..?

నిధుల లేమితో ముందుకు రాని కాంట్రాక్టర్

కథలాపూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలంలో పల్లె దవాఖానాల నిర్మాణాలు పూర్తయ్యేదెన్నడో అని ప్రజలు ఎదురు చేస్తున్నారు. సిరికొండ, దూలూరు, కథలాపూర్, అంబారిపేట, తక్కళ్ళపల్లి గ్రామాల్లో పల్లె దవాఖానాల నిర్మాణానికి బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఒక్కో భవనానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేసింది. దూలూరు, సిరికొండ గ్రామాల్లో నిర్మాణ పనులు స్లాబ్ లెవల్‌లో నిలిచిపోయాయి. కథలాపూర్‌లో స్థల సమస్యతో ఇప్పటికీ పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. తక్కళ్ళపల్లిలో గ్రామ పంచాయతీ గ్రామ శివారులో పల్లె దవాఖానా నిర్మాణానికి స్థలం కేటాయించారు. అయితే మూడేళ్ళు గడుస్తున్నా కాంట్రాక్టర్ పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. గతంలో చేసిన పనులకు నిధులు రాకపోవడంతో పనులు ప్రారంభించేందుకు వెనకంజ వేస్తున్న నేపథ్యంలో వైద్య సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. చిన్నారులకు రోగ నిరోధక టీకాలు, అవగాహన సదస్సులు, మందులు, ఇతరత్రా సామగ్రి నిల్వ ఉంచుకునేందుకు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం వైద్య సిబ్బంది. ఆశా కార్యకర్తలు గ్రామ పంచాయతీలోనే జనాలకు సేవలు అందిస్తున్నారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన సమావేశాలు ఉన్న సందర్భాల్లో సేవలకు అంతరాయం ఏర్పడుతోందని వైద్య సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



తక్కళ్లపల్లిలో పల్లె దవాఖానా కోసం కేటాయించిన స్థలం

పనులు ప్రారంభించాలి

మొలిగె శ్రీనివాస్, మాజీ సర్పంచ్, తక్కళ్ళపల్లి



పల్లె దవాఖానాకు గతంలో స్థలం కేటాయించినప్పటికీ పనులు ప్రారంభించకపోవడం వల్ల వైద్య సేవలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీలో వైద్య సిబ్బందికి అసౌకర్యంగా ఉంటోంది. టీకాలు, ఇతరత్రా సేవలు అందించలేని పరిస్థితి ఉంది. పనులు పూర్తయితేనే ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందడానికి అవకాశం ఉంటుంది.

రాంచంద్రాపూర్, కురుమపల్లి సర్పంచ్ ఎన్నికలు జరిగేనా?

- కురుమపల్లి నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటుపై కోర్టు స్టే

సైదాపూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కురుమపల్లి నూతన గ్రామపంచాయతీగా ఏర్పడింది. దీంతో రాంచంద్రాపూర్ గ్రామస్థులు కురుమపల్లిని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు తగిన అర్హతలు లేవని, కురుమపల్లి నూతన గ్రామపంచా యతీని రద్దు చేయాలని, రాంచంద్రాపూర్ గ్రామంలోనే కొనసాగించాలని కోరుతూ గ్రామస్థులు 2024లో ములుగు రాజు, 2025లో పోతారం నవీన్ కోర్టును ఆశ్రయించారు. 13ఫిబ్రవరి 2025న దీనిపై కోర్టుస్టే ఇచ్చింది. కాగా ప్రభుత్వం స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు గ్రామాల ప్రకారం అధికారులు రిజర్వేషన్లు తీశారు. రాంచంద్రాపూర్‌కు జనరల్, కురుమపల్లికి బీసీ మహిళగా రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఇంతలో సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆయా గ్రామాల ఆశావహులు సమతమవుతున్నారు. అయితే రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఈ గ్రామాలకు వేర్వేరుగా ఎన్నికలు నిర్వహిస్తారా?. లేక ఉమ్మడిగా ఎన్నికలు నిర్వహిస్తారా?. కోర్టుతీర్పు వచ్చేవరకు ఎన్నికలు వాయిదావేస్తారా?. అనే ఉత్కంఠ నెలకొంది. దీంతో ఆశావహులు ఎటూ తేల్చుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై సైదాపూర్ ఎంపీడీవోను వివరణ కోరగా రాంచంద్రాపూర్, కురుమపల్లి గ్రామాల్లో ఎన్నికలు ఎర్వహణ ఎలక్షన్ కమిషన్ నిర్ణయంపై ఆధారపడి ఉందన్నారు.



రాంచంద్రాపూర్ గ్రామ పంచాయతీ

సరస్వతీ నమస్తుభ్యం

- మూలా నక్షత్రం... సరస్వతి అలంకారం
- సరస్వతి ఆలయాలు, పలు మండపాల్లో పూజలు
- మహాశక్తి ఆలయానికి పోటెత్తిన భక్త జనం..





మహాశక్తి ఆలయంలో, పాతబజార్ గౌరీశంకరాలయంలో సరస్వతిమాత అలంకరణ

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో మూలానక్షత్రం సందర్భంగా సోమవారం దుర్గాదేవి సరస్వతీ మాతగా దర్శనమిచ్చింది. చైతన్యపురి మహాశక్తి ఆలయంలో మహాగౌరీ అమ్మవారికి సరస్వతీ పూజ చేశారు. విద్యార్థులతో అక్షరాభ్యాసాలు, పూజలు, పల్లకీసేవలు, హోమాలు నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ హాజరయ్యారు. యజ్ఞవరాహస్వామి దేవాలయంలోని వాగ్వాదినీ మహాసరస్వతి అమ్మవారి ఆలయంలో పంచామృతాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. సర్వవైదికసంస్థానంట్రస్టు మేనేజింగ్‌ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాదశర్మ, సభ్యులు పాల్గొన్నారు. శ్రీపురంలో దుర్గామాతకు సరస్వతీఅలంకారం చేశారు. గాయత్రీనగర్ గణేశశారదా శంకరాలయంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు జరిపారు. పాతబజార్ గౌరీశంకరాలయంలో అమ్మవారికి సరస్వతీమాతగా అలంకరించారు. అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతామదిరంలో సరస్వతీరూపంలో అమ్మవారికి విష్ణుసేవా నందగిరిస్వామి పూజలు చేశారు.



మహాశక్తి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం

కరీంనగర్ రూరల్ : కరీంనగర్ మండలం నగునూర్‌లోని పరివార సమేత దుర్గాభవానీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు సరస్వతీ అలంకరణలో హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు పవనకృష్ణశర్మ అమ్మవారికి ప్రత్యేక హారతి ఇచ్చి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు వేములవాడ ద్రోణాచారి, నీరుమల్ల తిరుపతి, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న యూరియా పట్టివేత

మంథనిరూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవి సోమన్‌పల్లివద్ద సోమవారం అక్రమంగా తరలిస్తున్న యూరియా బస్తాల వాహనాన్ని ప్రత్యేక సిబ్బంది పట్టుకున్నారు. మంథనినుంచి పికప్ వాహనంలో భూపాలపల్లిజిల్లా కాటారం మండలానికి 50బస్తాలను తరలిస్తుండగా అడవిసోమన్‌పల్లి చెక్‌పోస్టువద్ద ప్రత్యేకసిబ్బంది పట్టుకొని మంథనికి తరలించారు. దీనిపై వ్యవసాయాధికారులు విచారణ జరుపుతున్నారు.



పట్టుకున్న వాహనంలో యూరియా బస్తాలు

నాలుగు కొలువులు సాధించిన కనుకులగిద్దె యువకుడు



మొగిలిచర్ల కిషోర్

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుకులగిద్దె గ్రామానికి చెందిన మొగిలిచర్ల కిషోర్ నాలుగు ప్రభుత్వ కొలువులు సాధించి యువతకు ఆదర్శంగా నిలిచాడు. 2017లో టీఎస్ఎస్పీ కానిస్టేబుల్, 2019లో పంచాయతీకార్యదర్శి, 2024లో సివిల్‌కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించగా, ఇటీవల విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో ఎక్సైజ్‌ఎస్సైగా ఎంపికయ్యాడు. పట్టుదల, అంకిత భావం, స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగితే కొలువు సాధించవచ్చని నిరూపించాడు.

ఇసుక తరలిస్తున్న వ్యక్తి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఆలకుంట శివను రిమాండ్ చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి సోమవారం తెలిపారు. వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఇసుక అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డాడని పేర్కొన్నారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి హెచ్చరించారు.

జగిత్యాల బీఆర్ఎస్‌లో విభేదాలు

- జడ్పీటీసీ టికెట్ కోసం జిల్లా అధ్యక్షుడితో మాజీ ఎంపీపీ వాగ్వాదం
- పార్టీ నుంచి సస్పెన్షన్

జగిత్యాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల నేపథ్యంలో జగిత్యాల జిల్లాకేంద్రంలో బీఆర్ఎస్‌లో విభేదాలు బయటపడ్డాయి. జగిత్యాల రూరల్ జడ్పీటీసీ టికెట్ విషయంలో వాగ్వాదం జరగడంతో మాజీఎంపీపీ పాలెపు రాజును బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు సస్పెండ్‌చేశారు. స్థానిక ఎన్నికలపై సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జగిత్యాల రూరల్ జడ్పీటీసీస్థానం జనరల్‌కు రిజర్వ్ అయిందని తనకు అవకాశంఇవ్వాలని బీఆర్ఎస్‌జిల్లా అధ్యక్షుడితో మాజీ ఎంపీపీ పాలెపురాజు వాగ్వాదానికి దిగాడు. దీంతో అక్కడున్న మిగతా బీఆర్ఎస్ నాయకులు ఇన్నిరోజులు ఎక్కడ ఉన్నావంటూ రాజుపై విరుచుకు పడ్డారు. దీంతో రాజుకు, మిగతా నాయకులకు మధ్య తీవ్రవాగ్వాదం జరిగింది. అనంతరం రాజును కొందరు బీఆర్ఎస్ నాయకులు బలవంతగా పార్టీ కార్యాలయం నుంచి బయటికు పంపించారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ పాలెపు రాజును పార్టీనుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటిం చారు. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వెంట పాలెపు రాజు తిరుగుతూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు విద్యాసాగర్‌రావు ప్రకటించారు.



మాజీఎంపీపీ రాజును బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటిస్తున్న విద్యాసాగర్‌రావు

ఎనిమిదో రోజు ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

- ధర్మపురిలో మహాగౌరీ రూపంలో అమ్మవారు..
- గరుడ వాహనంపై శ్రీ యోగ, ఉగ్ర నరసింహ స్వామి ఊరేగింపు



అమ్మవారికి హారతి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

ధర్మపురి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ధర్మపురి క్షేత్రంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ రామలింగేశ్వర స్వామి ఆలయంలో దసరా నవరాత్రోత్సవాలు ఎనిమిదవ రోజు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ రోజు అమ్మవారలు తెలుపువర్ణ వస్త్రధారణలో మహాగౌరీ రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారలను దర్శనం చేసుకున్నారు. శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. నవదుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో దుర్గామాత వద్ద రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం వేళలో లక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుంచి మండపం వరకు మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ఇదిలా ఉండగా సాయంత్రం శ్రీయోగ, ఉగ్రనరసింహ స్వామి వారలను గరుత్మంత వాహనంపై పురవీధుల గుండా ఊరేగించారు. సాయంత్రం అమ్మవారలకు షోడషోపచార పూజతో హారతి, మంత్రపుష్పం, కన్యకాపూజ, ముత్తైదువల లలిత సహస్రనామ పారాయణంతో తీర్థప్రసాద వితరణ జరిపారు. టీటీడీ కల్యాణ మండపంలో నవదుర్గ సేవా సమితి, చింతామణి చెరువు వద్ద మహా శక్తి సేవా సమితి, తిమ్మాపూర్ శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో, ఒజ్జల వీధిలో, నేరెళ్లలో రుత్వికులు అమ్మవారలకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జుక్కు రవీందర్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్లశ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ధర్మకర్తలు ఏదులాపురం మహేందర్, బాదినేని వెంకటేష్, భక్తులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న మంత్రి లక్ష్మణ్‌కుమార్..

ధర్మపురి క్షేత్రంలోని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించిన దేవి నవరాత్రోత్సవాల్లో రాష్ట్ర ఎస్సీఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తనకొడుకు హరీష్‌తోకలిసి అమ్మవారలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే లక్ష్మీ నరసింహ స్వామి వారిని కూడా దర్శనం చేసుకున్నారు. మంత్రి లక్ష్మణ్‌కుమార్‌ను ఆలయం పక్షాన శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

వేములవాడలో కాళరాత్రి అలంకారంలో..



రాజన్న ఆలయంలో కాళరాత్రి అలంకారములో అమ్మవారు

వేములవాడ కల్చరల్ : వేములవాడ శ్రీరాజరాజేశ్వరి అమ్మవారు సోమవారం భక్తులకు కాళరాత్రి అలంకారంలో దర్శనమిచ్చారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని పాట్నా హైకోర్టు న్యాయమూర్తి గున్ను అనుపమ చక్రవర్తి దర్శించుకున్నారు. సోమవారం రోజున కుటుంబ సభ్యులతో కలిసి రాజన్న ఆలయానికి వచ్చి ఆమెకు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. వారి వెంట వేములవాడ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి అజయ్‌కుమార్ జాదవ్, సిరిసిల్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ. ప్రవీణ్, వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తదితరులు ఉన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన హరితను ఆలయ ఈవో కలిసి రాజన్న ప్రసాదం అందజేశారు.



పాట్నా న్యాయమూర్తికి రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఉద్యోగులు

యువకుడి హత్య కేసులో నిందితుల అరెస్ట్

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలో ఈనెల27న జరిగిన యువకుడి హత్యకేసులో నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. సోమవారం జగిత్యాల రూరల్ సీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ వివరాలను వెల్లడించారు. రేచపల్లి గ్రామానికి చెందిన ఎదురుగట్ల సతీష్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ యువతితో ఉన్న ఫొటోను షేర్ చేశాడు. సదరు యువతి తన ప్రియురాలని ఆమెను ఎవరూ పెళ్లి చేసుకోవద్దంటూ అసభ్యకరంగా పోస్ట్ చేశాడు. దీంతో ఆగ్రహానికి గురైన అమ్మాయి బంధువులు నాతరి వినంజీ, నాతరి శాంత, నాతరి జల మరో మైనర్.. యువతి పరువు తీసిన సతీష్‌ను ఎలాగైనా చంపాలను కున్నారు. ఈక్రమంలోనే ఇంట్లో పడుకొని ఉన్న సతీష్‌ను బయటకు తీసుకువచ్చి కర్రలతో దాడి చేశారని డీఎస్పీ తెలిపారు. ఈదాడిలో సతీష్ అక్కడికక్కడే మృతిచెందగా నిందితులు అక్కడినుంచి పారిపోయారని తెలిపారు. మృతుడి తండ్రి ఎదురుగట్ల రాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. సోమవారం రేచపల్లి శివారులో టీ జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నిందితులను పట్టుకున్నామని తెలిపారు. నిందితుల వద్ద నుంచి హత్యకు వినియోగించిన కర్రలు, దుస్తులు, ఓ సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు. హత్య మిస్టరీని చేధించి నిందితులను పట్టుకున్న జగిత్యాల రూరల్‌సీఐ సుధాకర్, ఎస్‌ఐ గీతను ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్ అభినందించారు.



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

ఇంట్లోకి చొరబడిన కొండచిలువ

మల్యాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రంలోని పొన్నం ముత్తవ్వ అనే వృద్ధురాలి ఇంట్లో ఆదివారం రాత్రి ప్రమాదకర కొండచిలువ భయభ్రాంతులకు గురిచేసింది. ఇంట్లో చీపురు కోసం వెళ్లిన ముత్వవ్వకు చీపురుస్థానంలో కొండచిలువచేతికి తాకడంతో వెనక్కివచ్చి కుటుంబసభ్యులకు, స్థానికులకు సమాచారం అందించింది. దీంతో అతికష్టం మీద దాన్ని చంపేశారు.



హతమైన కొండచిలువ

పూజారిపై దాడి.. తలకు తీవ్ర గాయాలు

కోల్‌సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రుల పూజలో కంకణం కట్టలేదని పూజారితో గొడవపడి, దాడిచేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. గోదావరిఖని శివాజీనగర్‌లో సోమవారం పనకంటి రాజేశ్వర్‌రావు (64)అనే పూజారిపై అదేకాలనీకి చెందిన తోట వేణు దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో రాజేశ్వర్‌రావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. పూజారిపై దాడికి పాల్పడడంతో బ్రాహ్మణసేవా సమాఖ్య, భవానీమాలధారణ భక్తులు, బజరంగ్ దళ్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. మెయిన్ చౌరస్తాలోని పోచమ్మ ఆలయం నుంచి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. రౌడీషీటర్ అయిన తోట వేణు పూజారిపై దాడికి పాల్పడడం సిగ్గుచేటని, అతనిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, కఠినచర్యలు తీసుకోవాలంటూ ఒజ్జల వెంకటేశ్వర్లు, నిఖిల్, దామోదరశర్మ, అనిరుధ్, శ్రీనివాస్ తదితరులు డిమాండ్ చేశారు. అనంతరం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తోటవేణు తల్లి అనసూర్య శివాజీనగర్‌లోని అమ్మవారి మండపానికి పూజకు వెళ్లి పూజారిని కంకణం కట్టమని అడిగింది. తనదగ్గర నుంచి భవానీ మాలధారులు కంకణాలు తీసుకున్నారని, వారే కడతారని పూజారి పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న తోట వేణు మండపం వద్దకు వచ్చి పూజారిని పక్కకు తీసుకెళ్లి గొడవపడ్డాడు. అతనిపై తాంబాలంతో దాడిచేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వేణుపై హత్యాయత్నం కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.



నిరసన తెలుపుతున్న పురోహితులు, భవానీ మాలధారులు

ఎస్సారెస్పీ నుంచి 3,25,000 క్యూసెక్కుల నీటి విడుదల

జగిత్యాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ 39 గేట్లు ఎత్తి 3,25,000 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 54.292 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇందులో కాకతీయ కాలువకు 4,000, సరస్వతీ కాలువకు 400 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది.

ఉధృతంగా గోదావరి..

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ నీటిని వదల డంతో ఇబ్రహీంపట్నం మండలం కోమటి కొండాపూర్, ఎర్దండీ, యామాపూర్ గ్రామాల్లో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

మిడ్ మానేరుకు 7,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర జలాశయానికి (మిడ్‌మానేరు) ప్రాజెక్టుకు సోమవారం 7,400 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉన్నది. వరద కాలువ ఇన్‌లెట్స్‌తో పాటు మూలవాగు ద్వారా 7,400 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతుంది. దిగువకు మూడు గేట్ల ద్వారా 7,250 క్యూసెక్కులు ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 27.55టీఎంసీలకు 27.248 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఎల్‌ఎండీ నుంచి 13,309 క్యూసెక్కుల అవుట్ ఫ్లో

తిమ్మాపూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దిగువ మానేరు జలాశయం నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. మోయతుమ్మెద వాగునుంచి 5,259 క్యూసెక్కులు, మిడ్ మానేరు నుంచి 6,500 క్యూసెక్కులు, ఎగువ కాకతీయ కాలువ నుంచి 1550క్యూసెక్కులు మొత్తం 13,309 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. ఆదేవిధంగా 6 స్పిల్‌వే గేట్ల నుం చి 12వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ నుంచి వెయ్యి క్యూసెక్కులు, మిషన్ భగీరథ, నీటి ఆవిరి రూపంలో 309 క్యూసెక్కులు మొత్తం 13,309 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుందని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.



గంగాధరలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు | రాజన్నసిరిసిల్ల తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేటలో.. | పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో.. | జగిత్యాల జిల్లా కోరుట్లలో..

శ్రీలక్ష్మి నీ మహిమలూ..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా సద్దుల బతుకమ్మ



బతుకమ్మ వేడుకల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ దంపతులు

కుటుంబ సభ్యులతో మంత్రి పొన్నం ప్రభాకర్

బతుకమ్మతో ఎమ్మెల్యే గంగుల కమలాకర్



టవర్‌సర్కిల్‌లో మహిళల బతుకమ్మ

మహాశక్తి ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబరాలు సోమవారం ఘనంగా జరిగాయి. మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని బతుకమ్మ ఆడారు. వాడవాడనా బతుకమ్మ పాటలు మారుమోగాయి. తీరొక్క పూలతో చేసిన బతుకమ్మలను ఆయా కూడళ్ల వద్ద ఉంచి బతుకమ్మ ఆడి రాత్రి వేళలో నిమజ్జనం చేశారు. అనంతరం వాయినాలు ఇచ్చుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. - ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



కరీంనగర్‌లో బతుకమ్మలతో యువతులు, గోకుల్‌నగర్ చౌరస్తా వద్ద, జగిత్యాల మండలం పొరండ్లలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో..

మున్నూరుకాపులు అన్ని రంగాల్లో రాణించాలి



మహాశక్తి ఆలయం వద్ద కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపులు ఐక్యంగా ముందుకు సాగుతూ అన్ని రంగాల్లో రాణించాలని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని మహాశక్తి దేవాలయంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో మంత్రి సంజయ్‌కుమార్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా మున్నూరుకాపులు సంఘటితం అయ్యేందుకు సంఘం కృషి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ మున్నూరుకాపుల అభివృద్ధి, సంక్షేమం కోసం సంఘం కృషి చేయాలని, అందుకు అవసరమైన తోడ్పాటును అందించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పుట్ట పురుషోత్తం, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

కరీంనగర్ కల్చరల్: శరన్నవరాత్రుల్లో భాగంగా సోమవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చైతన్యపురి మహాశక్తి దేవాలయంలో అమ్మవార్లను దర్శించుకొని పూజలు నిర్వహించారు. అర్చకులు ఎంఎల్ఏకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేసి ఆశీర్వచనం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజజయ్‌కుమార్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, నాయుకులు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గ్లోబల్ వార్మింగ్ బతుకమ్మ

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్‌కు చెందిన గౌరిశెట్టి మునీందర్ అనురాధ కుటుంబం బతుకమ్మను 15 సంవత్సరాలుగా ఒక సందేశంతో కూడిన బతుకమ్మనున్నారు. సోమవారం సద్దుల బతుకమ్మ సందర్భంగా సామాజిక పర్యావరణ సందే శాలకు వేదికగా స్టాప్ గ్లోబల్ వార్మింగ్-స్టార్ట్ గ్రీన్ లివింగ్ పేరుతో అందమైన బతుకమ్మను పేర్చా రు. గ్లోబల్ వార్మింగ్ ఒక పదం కాదని, మానవాళికి హెచ్చరిక అని మునీందర్ అనురాధ తెలిపారు. బతుకమ్మలో పర్యావరణ పరిరక్షణ బోర్డులు, నినాదాలు ఆలోచింపజేసేలా ఉన్నాయి.



గ్లోబల్ వార్మింగ్ బతుకమ్మతో గౌరిశెట్టి మునీందర్ దంపతులు

'స్థానిక' సమరానికి సై

- ఢిల్లీలోనే కాదు.. గల్లీలోనూ కాషాయ జెండా ఎగరేస్తాం..
- కరీంనగర్, సిరిసిల్ల జడ్పీ పీఠాలను కైవసం చేసుకుని కొత్త చరిత్రను లిఖిస్తా
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి బీజేపీ సిద్ధంగా ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఢిల్లీ ఎన్నికల్లోనే కాదు... గల్లీ ఎన్నికల్లోనూ కొట్లాడేందుకు తాను సిద్ధమని తెలిపారు. స్థానిక సమరంలో ఈసారి బీజేపీ కొత్త చరిత్రను లిఖించబోతోందన్నారు. కరీంనగర్, సిరిసిల్ల జిల్లా పరిషత్ పీఠాలపై కాషాయ జెండా ఎగరేసి తీరుతామని స్పష్టం చేశారు. ఆసియా కప్, ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ లలో ఇండియా ఘన విజయం సాధించినట్లుగానే రేపు జరగబోయే కరీంనగర్ పల్లె లీగ్ (కేపీఎల్ లీగ్), సిరిసిల్ల పల్లె లీగ్ (ఎస్పీఎల్) పోటీల్లోనూ బీజేపీ అభ్యర్థుల గెలుపు తథ్యమన్నారు. పార్టీని నమ్ముకుని ఏళ్ల తరబడి పనిచేస్తున్న నిఖార్సైన బీజేపీ కార్యకర్తలకే ఈసారి ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో టిక్కెట్లు ఇచ్చి గెలిపించుకుంటామని తెలిపారు. పంచాయతీల్లో జరిగే పనులన్నీ కేంద్ర నిధులతో చేస్తున్నవేనని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని గల్లీ గల్లీలోనూ కాషాయ జెండా ఎగరేస్తామని చెప్పారు. ఈ ఎన్నికల్లో గెలిచే అవకాశమున్న నాయకులకు మాత్రమే టిక్కెట్లు ఇస్తామన్నారు. అభ్యర్థుల ఎంపిక కోసం ఇప్పటికే ఒకసారి సర్వే చేయించామన్నారు. ఎటువంటి పైరవీలకు తావివ్వబోమన్నారు. టికెట్లు రాని వారు నిరాశ చెందవద్దని,పార్టీలో, ఇతరత్రా పదవుల్లో అవకాశం ఇచ్చి గౌరవిస్తామన్నారు.

సిరిసిల్లలో నూతన కోర్టు నిర్మాణం

5 ఎకరాల స్థలంలో ఏర్పాటుకు రూపకల్పన

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని 5.1ఎకరాల స్థలంలో 81.26 కోట్ల రూపాయలతో ఆధునాతన పద్ధతులతో 'న్యాయ నిర్మాణ్ భవన్' సముదాయం నిర్మాణానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. జి ప్లస్4 విధానంలో భవన సముదాయాన్ని నిర్మించ డానికి రూపకల్పన చేశారు. ఈ భవన సముదాయం నమూనా చిత్రాన్ని సోమవారం సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు విడుదల చేశారు. ప్రతి అంతస్తును 48 వేల చదరపు అడుగుల చొప్పున అయిదు అంతస్తుల్లో 2.49లక్షల చదరపు అడుగులతో నిర్మించనున్నారు. భవిష్యత్తులోనూ మరో రెండు అంతస్తులు నిర్మించేలా రూపకల్పన చేశారు. ప్రతి ఫ్లోర్‌కు వెళ్లేందుకు కక్షిదారులకు ఒక లిఫ్ట్, న్యాయవాదులు, అధికారులకు మరొక లిఫ్ట్ ఏర్పాటు చేయనున్నారు. గ్రౌండు ఫ్లోర్‌లో పూర్తిస్థాయిలో 300 కార్లు, 62 బైక్‌ల పార్కింగ్ సౌకర్యం కల్పించడానికి నిర్ణయించారు. ఇందులో ప్రస్తుతం ఉన్న జిల్లా కోర్టు, 1వ అడిషనల్ సెషన్స్ జిల్లా కోర్టు, పోక్సో కోర్టు, ఫ్యామిలీ కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు, 1వ అదనపు జూనియర్ సివిల్ కోర్టు, 2వ అదనపు జూనియర్ సివిల్ కోర్టులతో పాటు భవిష్యత్తులో మంజూరయ్యే మరో ఆరు కోర్టులు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా న్యాయ నిర్మాణ్ భవనాన్ని నిర్మించడానికి టెండర్ పూర్తయింది.

జాతీయ హ్యాండ్ బాల్ పోటీల్లో పతకాలు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి మినీ హ్యాండ్ బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. హైదరాబాద్‌లోని నిజాం కళాశాల మైదానంలో ఈ నెల 26 నుంచి 29 వరకు నిర్వహించిన 17వ మినీ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా కాటారం ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థి నిఖిల్‌రాజ్, జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థిని ఎ.లాస్యపటేల్ సత్తాచాటారు. బాలికల విభాగంలో స్వర్ణం, బాలుర విభాగంలో రజత పతకం సాధించినట్లు ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఈ క్రీడాకారులను జిల్లా యువ జన క్రీడాశాఖ అధికారి వి.శ్రీనివాస్‌గౌడ్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కాసర్ల ఆనంద్‌కుమార్, రమణారావు, సంయుక్త కార్యదర్శి నమిలకొండ ప్రభాకర్ పాల్గొన్నారు.



పతకాలు సాధించిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

దుబాయిలో ఈటీసీఏ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు



దుబాయ్‌లో బతుకమ్మ వేడుకలకు హాజరైన ఎంపీలు డీకె అరుణ, రఘునందన్‌రావు

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఆల్ అబ్లీ స్పోర్ట్స్ క్లబ్ ఆడిటోరియంలో ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్(ఈటీసీఏ) ఆధ్వర్యంలో ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. మహబూబ్‌నగర్, మెదక్ బీజేపీ పార్లమెంట్ సభ్యులు డీకే అరుణ, మాధవనేని రఘునందన్‌రావు, కాన్సులేట్ జనరల్ సతీష్ కుమార్ శివన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటీసీఏ వ్యవస్థాపక అధ్య క్షుడు కిరణ్‌కుమార్ పీచర, అధ్యక్షుడు జగదీష్‌రావు చీటి మాట్లాడారు. బతుకమ్మ వేడుకలు నేడు వేలాదిమంది తెలంగాణ కుటుంబ సభ్యుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ గల్ఫ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు ప్రముఖ తెలంగాణ జానపద గాయని మధుప్రియ, ముకుంద, ఫోక్ డ్యాన్సర్ మౌనిక డింపుల్, లాస్య స్మైలి సందడి చేశారు. ఈటీసీఏ జనరల్ సెక్రెటరీ రాణి కోట్ల, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ అలిగేటి, సంయుక్త కార్యదర్శి శేఖర్‌గౌడ్ గుండవేని, కోశాధికారి తిరుమల్‌రావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం చేయడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని విభాగ్ ప్రచారక్ భానుచందర్ తెలిపారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం బీఎంఎస్ కార్యాలయంలో జరిగిన దసరా ఉత్సవంలో మాట్లాడారు. 1925 విజయ దశమి రోజు ప్రారంభమైన ఆర్ఎస్ఎస్ దేశ వ్యాప్తంగా విస్తృత శాఖలతో ప్రజల్లో దేశ భక్తి, ధర్మ నిష్ఠ కలిగేలా పని చేస్తున్నట్టు తెలిపారు. భిన్న రంగాల్లో జాతీయ భావజాలాన్ని పెంపొందిస్తున్నట్టు పేర్కొన్నారు. హిందుత్వ జీవన విధానం విశ్వశాంతికి ఆధారమని, అన్ని మతాలను సమన్వయ పరిచే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నట్టు పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థను కాపాడుకోవడం, పర్యావరణ పరిరక్షణ, అస్పృశ్యత నివారణ, స్వదేశీ వస్తు వినియోగంపై ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రామదొరైరెడ్డి, ముత్యాల బాలయ్య, దిలీప్, సారంగపాని, రాజిరెడ్డి, రాజు, పాల్గొన్నారు.





గ్రూప్-1 ఉద్యోగులకు అభినందన


ఉద్యోగిని అభినందిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, శివశంకర్ వరప్రసాద్‌ను సన్మానిస్తున్న జీఎం లలిత్ కుమార్

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): ఇటీవల గ్రూప్ 1 ఉద్యోగం సాధించిన బనావత్ వనజ సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కోయశ్రీహర్షను మర్యాద పూర్వకంగా కలిశారు. వనజకు ఆయన పూల కుండీ అందించి అభినందనలు తెలిపారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన వనజ డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. పెద్దపల్లి జిల్లాకు డిప్యూటీ ట్రైనీ కలెక్టర్‌గా విధుల్లో చేరారు.

గోదావరిఖని,(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఉద్యోగం సాధించిన సింగరేణి ఉద్యోగి కుమారుడిని సోమవారం ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ అభినందించారు. ఓసీపీ-1లో ఈపీ ఆపరేటర్‌గా పని చేస్తున్న తుంగపిండి ఆనంద్ కుమారుడు శివ శంకర్ వరప్రసాద్ గ్రూప్-1లో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్‌గా ఎన్నికయ్యారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలు ఉన్నత స్థానాలకు వెళితే తల్లిదండ్రులకు గర్వకారణంగా ఉంటుందన్నారు. రవీందర్‌రెడ్డి, వీరారెడ్డి, మల్లేష్, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి ఎంపీవోగా ఎన్నిక


శ్రీనివాస్

మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): గోపాల్‌పూర్ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న బైరం శ్రీనివాస్ గ్రూపు-2 ఫలితాల్లో ఎంపీవోగా ఎంపికయ్యారు. 2014లో పంచాయతీ కార్యదర్శిగా నియామకమైన శ్రీనివాస్ గ్రూపు-3, 4లో సెలక్ట్ కాగా తాజా గా విడుదల చేసిన గ్రూపు-2 ఫలితాల్లో ఎంపీవోగా సెలక్ట్ కావడంతో తోటి పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.

అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు


పెద్దపల్లి ఎల్లమ్మ చెరువు వద్ద ఎమ్మెల్యే విజయరమణారావు

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ/ పాలకుర్తి/ ఓదెల/ఎలిగేడు/పెద్దపల్లి రూరల్/ కాల్వశ్రీరాంపూర్/ సుల్తానాబాద్/రామగిరి/జూలపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒక్కేసి పువ్వేసి చందమామ... ఒక్క జాములాయే చం దమామ... శివపూజ వేళయే చంద మామ... శివుడు రాకపాయే చందమామ..., రామ రామా ఉయ్యాలో... రామనే శ్రీరామ ఉయ్యాలో.... ఏమేమి పువ్వప్పునే గౌరమ్మ.... ఏమేమి కాయప్పునే గౌరమ్మ... అంటూ ఆడ పడుచులు చప్పట్లతో దరువులు వేస్తూ బతుకమ్మ ఆడారు... తంగెడు, గునుక, సీతజడ, బంతి, చామంతి తదితర పూలతో మహిళలు బతుకమ్మలను పేర్చారు. ఇంట్లో పూజల అనంతరం సాయంత్రం కూడళ్ళ వద్దకు చేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలు ఆడారు. ఆర్‌సీఏఓ క్లబ్‌లో సింగరేణి ఆర్‌జీ-1 సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, మనాలీ ఠాకూర్ దంపతులు, ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్, అనిత దంపతులు పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవా లని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. సింగరేణి వ్యాప్తంగా అన్నీ డివిజన్లలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం బతుకమ్మలను పాటలు పాడుతూ గోదావరిలో, ఆలయాల వద్ద నిమజ్జనం చేశారు. మహిళలు ఒకరినొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. వన్‌టౌన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఏసీపీ మడత రమేష్, నాయకులు మహంకాళి స్వామి, దూళికట్ట సతీష్, ముస్తాఫా, అధికారులు, కార్మిక కుటుంబాలు పాల్గొన్నాయి.

పాలకుర్తి మండల వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఓదెల మండలంలో సద్దుల బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. సొంత గ్రామాలకు చేరుకున్న మహిళలు కుటుంబాల వారిగా నూతన వస్త్రాలంకరణ ధరించి గ్రామాల్లో వీధివీధినా బతుకమ్మలతో సందడి చేశారు. ఎలిగేడు మండలంలో సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. గ్రామపంచాయతీ అధికారులు విద్యుత్ దీపాలంకరణ చేశారు. శివపల్లిలో సద్దుల బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు దంపతులు పాల్గొన్నారు. పెద్దపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సద్దుల బతుకమ్మ


పాలకుర్తిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


సుల్తానాబాద్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


లక్ష్మీనగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

సందర్భంగా తీరొక్క పూలతో బతుకమ్మ లను పేర్చి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో ప్రజలు భక్తి శ్రద్ధలతో బతుకమ్మ జరుపుకున్నారు. బతుకమ్మలను ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలు, వాగుల్లో నిమజ్జనం చేశారు. సుల్తానా బాద్‌లో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. బతుకమ్మ వేడుకలను ఎమ్మెల్యే విజ యరమణరావు, గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్-పుష్పలత, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు సందర్శించారు. సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ రాణిరుద్రమదేవి క్రీడాప్రాంగణంలో బతుకమ్మ ఫ్యామిలీ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఆర్జీ-3,ఏపీఏ జీఎంలు సుధాకర్ రావు, నాగేశ్వర్‌రావులు హాజరై వేడుకలను ప్రారంభిం చారు.


మంథని, పెద్దపల్లి, బతుకమ్మ ఆడుతున్న మహిళలు, గోదావరిఖనిలో బతుకమ్మ ఆడుతున్న సతీమణి మనాలీ ఠాకూర్, బతుకమ్మలను నిమజ్జనానికి తరలింపు

'స్థానిక' సమరానికి మోగిన నగారా...

(5వ పేజీ తరువాయి)

15వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 16న పరిశీలన, 17 వరకు అభ్యంతరాలకు అవకాశం, 18న పరిష్కారం, నామినేషన్ల ఉప సంహరణకు 19 మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు విధించారు. 27న ఉదయం 7 గంటల నుంచి సాయం త్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబర్ 11వ తేదీన కౌంటింగ్ నిర్వహించనున్నారు.

మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు..

గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నారు. మొదటి విడత నోటిఫికేషన్ 17వ తేదీన వెలువడనున్నది. 19వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 20న పరిశీలన, 21న అభ్యంతరాలకు అవకాశం, 22న పరిష్కారం, నామినేషన్ల ఉపసంహరణ 23న మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు విధించారు. 31వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ అనంతరం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెలువడించనున్నారు.

● రెండో విడత నోటిఫికేషన్ 21న వెలువడనున్నది. 23వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరణ, 24న పరిశీలన, 25న అభ్యంతరాలకు అవకాశం, 26న పరిష్కారం, నామినేషన్ల ఉపసంహరణకు 26న మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు విధించారు. నవంబర్ 4వ తేదీన పోలింగ్ అనంతరం కౌంటింగ్ నిర్వహిస్తారు.

● మూడో విడత నోటిఫికేషన్ 25వ తేదీన వెలువడనున్నది. 27వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరణ 28న పరిశీలన, 29న అభ్యంతరాలకు అవకాశం, 30న పరిష్కారం, నామినేషన్ల ఉపసంహరణకు 31వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు విధించారు. నవంబర్ 8వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్, అనంతరం కౌంటింగ్ నిర్వహించి ఫలితా లను వెలువడించనున్నారు.

ఇద్దరు పిల్లలకు మించి అర్హతపై స్పష్టత లేదు..

ఇద్దరు పిల్లలకు మించి సంతానం ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హత లేదనే నిబంధన 1955 నుంచి కొనసాగుతున్నది. 2020లో రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఆ నిబంధనను తొలగించారు. స్థానిక సంస్థల ఎన్నికలో నిబంధనను తొలగిస్తారని అంతా భావించారు. కానీ అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు వెలువడ లేదు. నోటిఫికేషన్ వరకు ఎలాంటి ఉత్తర్వులు రాకుంటే మాత్రం ఇద్దరికి మించి పిల్లలు ఉన్న వాళ్ల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉండదని తెలుస్తున్నది.

రాములపల్లిలో సివిల్ రైట్స్ డే

ఎలిగేడు, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): రాములపల్లిలో సోమవారం పౌరహక్కుల దినోత్సవంను నిర్వహించారు. డిప్యూటీ తహసిల్దార్ సిరిపురం గిరి మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని సూచించారు. గ్రామాల్లో అంటరానితనం, కులవివక్ష పాటించవద్దని, అలా చేస్తే చట్టానికి ఎవరూ అతీతులు కాదన్నారు. గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాస్, ఆర్ఐ చంద్రశేఖర్, జీపీ కార్యదర్శి హరిబాబు, జీపీఓ షఫీ, పొట్యాల రమేష్, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మంథని మహాలక్ష్మీ అమ్మవారి ఊరేగింపు



మంథని, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాష్టమిని పురస్కరించుకొని మహాలక్ష్మీ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని సోమవారం ఊరేగించారు. కవ్వం చిలుకుతూ గీతాలపనకు అనుగుణంగా పలువురు దంపతులు నృత్యాలతో కన్నుల పండువగా సాగింది. గోపాల కాలువల్లో భాగంగా మహాలక్ష్మి ఉత్సవ విగ్ర హాన్ని ఊరేగింపు సందర్భంగా స్థానిక మందాట, పెంజేరు కట్ట, తమ్మి చెరువు కట్ట, లక్ష్మీనారాయణస్వామి, మహాలక్ష్మి ఆలయాల వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉట్టికొట్టే కార్యక్రమానికి తిలకించేందుకు భక్తులు తరలి వచ్చారు. లక్ష్మీనారాయణస్వామి ఆలయంలోని దుర్గామాత వద్ద నిర్వాహకులు, దాతలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.









స్థానిక సంస్థల రిజర్వేషన్ల గెజిట్ విడుదల

రామగిరి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జెడ్‌పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్‌ల ఎన్నికల రిజర్వేషన్‌లను విడుదల చేశారు. జెడ్‌పిటిసి జనరల్ మహిళా, ఎంపిపి (జనరల్ మహిళ) 16 గ్రామపంచాయతీలలో 11 ఎంపీటీసీ స్థానాల్లో రిజర్వేషన్‌ను ఖరారుచేశారు. బుధవారంపేట్ (ఎస్‌సిమహిళా), లద్నాపూర్ (ఎస్‌సి జనరల్), కల్వచర్ల, పన్నూరు-2 (బిసి మహిళా), జల్లారం, రత్నాపూర్, పన్నూర్-3(బీసి జనరల్), సుందిల్లా పన్నూర్-1(మహిళ జనరల్), నాగెపల్లి, బేగంపేట్(జనరల్)లకు కేటాయించారు.


ధర్మారం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 15 ఎంపీ టీసీ స్థానాలకు, 29 గ్రామ పంచాయతీ స్థానాలకు కేటాయించారు. ఎంపిటీసి స్థానాలు : కమ్మరిఖాన్‌పేట, బం జేరుపల్లి, ధర్మారం-2 ఎస్టీ జనరల్, ధర్మారం-1, కటికెనపల్లి, ఖిలా వనపర్తి బీసీ మహిళ, ఖానంపల్లి, కొత్తూర్, మేడారం-1 బీసీ జనరల్, దొంగతుర్తి, మేడారం-2 జనరల్ మహిళ, బొమ్మరెడ్డిపల్లి, గోపాల్ రావుపేట, రచ్చపల్లి జనరల్ కేటాయించారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో జడ్పీటీసీ, ఎంపీపీ, 17 ఎంపీటీసీ స్థానాలు, 30 సర్పంచ్‌లు, వార్డు సభ్యుల వారిగా రిజర్వేషన్‌లను ప్రభుత్వం ఖరారు చేసింది. పెద పల్లి జడ్పీటీసీ (బీసీమహిళ), ఎంపీపీ (జనరల్) కేటాయించారు.

ఎంపీటీసీలు స్థానాలు : కొత్తపల్లి (ఎస్‌సి మహిళ), పెద్దబొంకూరు, మూలసాల (ఎస్‌సి జనరల్), అందుగులపల్లి, మారేడుగొండ, బొంపల్లి (బిసి మహిళ), రాగినేడు, హన్మంతునిపేట, తుర్కలమద్దికుంట, పెద్దకల్వల (బిసి జనరల్), రాఘవపూర్, రంగాపూర్, నిట్టూరు (జనరల్ మహిళ), అప్పన్నపేట, భోజన్నపేట, గౌరెడ్డిపేట, పాలితం (జనరల్) స్థానాలుగా కేటాయించారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 22 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, 12 ఎంపీటీసీ స్థానాలు రిజర్వేషన్‌ల ఖరారయ్యాయి. ఎంపీటీసీ: ఓదెల -1, శానగొండ(జనరల్ మహిళ), ఓదెల -2, కనగర్తి, జీలకుంట (జనరల్), గోపరపల్లి, కొమిర, గుంపుల(బిసి జనరల్), కొలనూర్, నాంసానిపల్లి (బిసి మహిళ), మడక, పొత్కపల్లి (ఎస్‌సి జనరల్)గా ఖరారు చేశారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి) మండలంలో ఎంపిటిసి 9 స్థానాలకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. అబ్బాపూర్, కుమ్మరికుంట బిసి మహిళ, జూలపల్లి 1 జనరల్ మహిళ, జూలపల్లి 2లో, వడుకాపూర్ బిసి జనరల్, కాచాపూర్, వెంకట్రావుపల్లి జనరల్, పెద్దాపూర్ ఎస్సీ జనరల్, తెలుకుంట ఎస్సీ మహిళ కేటాయించినట్లు ఎంపీడీవో పద్మజ తెలిపారు.



కార్మిక సంక్షేమానికి పెద్దపీట


నెదర్‌ల్యాండ్ బృందంతో మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

గోదావరిఖని, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత కార్మిక సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని, కనీస వేతనాల రూపకల్పన పూర్తయ్యిందని, త్వరలోనే గెజిట్ నోటిఫికేషన్ వెలువడుతుందని రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి చైర్మన్ జనక్ ప్రసాద్ అన్నారు. సోమవారం కమిషన్ కార్యాలయంలో రాష్ట్ర కార్మికశాఖ, అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్ఓ) సమావేశాన్ని నిర్వహించారు. జనక్ ప్రసాద్ అధ్యక్షత వహించగా కమిషనర్ గంగాధర్ పాల్గొన్నారు. నెదర్‌లాండ్ ప్రభుత్వం విదేశాంగ మంత్రిత్వశాఖ సీనియర్ పాలసీ సలహాదారు చార్లెట్ బెర్నాండ్, ఐఎల్ఓ డైరెక్టర్ విచ్‌కో మియమోటో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న అంశాలను జనక్ ప్రసాద్ నెదర్‌లాండ్ బృందానికి వివరించారు. ఐఎల్ఓ ప్రతినిధులు రంజిత్ ప్రకాష్, అనూప్ సత్పతి, శ్రీనివాస్‌రెడ్డి, మీల జయదేవ్, ప్రొఫెసర్ రవి, వాసంతి, కార్మిక నాయకులు చంద్రశేఖర్, బోర్డు కార్యదర్శి శ్యాంసుందర్ జాజు అభిప్రాయాలు తెలిపారు.

క్రికెట్ గెలుపుపై సంబరాలు

సుల్తానాబాద్, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): ఆసియా కప్ క్రికెట్ ఫైనల్‌లో పాకిస్తాన్‌పై ఇండియా విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని సుల్తానాబాద్ పట్టణంలో యువత సంబరాలు జరుపుకున్నారు. ఇండియా గెలుపును అనంతరం సుల్తానాబాద్‌లోని పలు చౌరస్తాల వద్ద జెండాలతో దేశభక్తి నినాదాలతో సంబరాలు జరుపుకున్నారు. గజబీంకర్ పవన్, కూకట్ల నాగరాజు, కందునూరి కుమార్, బూసారపు సంపత్, సతీష్, శ్రవణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దసరా సెలవు మార్చాలని ఏఐటీయూసీ ఆందోళనలు

గోదావరిఖని, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో దసరా పండుగ సెలవును అక్టోబరు 2కు బదులుగా 3వ తేదీకి మార్చాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సోమవారం సింగరేణిలో ఆందోళనలు చేపట్టింది. బొగ్గు గనులు, డిపార్ట్‌మెంట్లు, ఓసీపీల్లో అధికారులకు వినతిపత్రాలు సమర్పించింది. దసరా పండుగ మహాత్మాగాంధీ జయంతి అక్టోబరు 2న రావడంతో పండుగను కార్మికులు జరుపుకునే పరిస్థితి లేదని నాయకులు అధికారులకు తెలిపారు. పండుగ రోజు బొగ్గు గనులపై మైసమ్మ పూజలను చేస్తే ప్రమాదాలు జరుగవనే విశ్వాసం ఉంటుందని అధికారులకు తెలిపారు. అక్టోబరు 2న గాంధీ జయంతి కాకుండా 3న సింగరేణి కార్మికులకు వేతనంతో కూడిన సెలవుదినాన్ని ప్రకటించాలని నాయకులు మాదన మహేష్, రంగు శ్రీను, సిద్ధమల్ల రాజు డిమాండ్ చేశారు. ఆర్‌జీ-1 పరిధిలోని వివిధ గనులు, డిపార్ట్‌మెంట్లపై జరిపిన నిరసన కార్యక్రమాల్లో ఏఐటీయూసీ నాయకులు మల్లికార్జున్, సతీష్ బాబు, ప్రసాద్, శ్రీనివాస్, తిరుపతి, వెంకటయ్య, వెంకన్న, అజీం పాషా, దాసరి శ్రీనివాస్, శ్రీనివాస్, అనీల్, శ్రీరాములు పాల్గొన్నారు.


అధికారులకు వినతి పత్రాలు అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): అక్టో బరు 2న దసరా గాంధీ జయంతి వచ్చిన అంశాన్ని దృష్టిలో ఉంచుకుని 3న పేయిడ్ హాలీడేగా మార్చాలని ఏఐటీయూసీ నాయకులు ఆర్జీ-2 పరిధిలోని గనులు, డిపార్ట్‌మెంట్లపై అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. తెలంగాణలో పెద్ద పండుగ అయిన దసరా, గాంధీ జయంతి ఒకే రోజు రావడంతో మైస మ్మకు మొక్కులు చెల్లించుకునే అవకాశం లేకుండా పోయిందని నాయకులు తెలిపారు. ఎల్ ప్రకాష్, జిగురు రవీందర్, అన్నారావు, శ్యాంసన్, సాంబశివరావు, మహేందర్, సంప త్, మహేందర్, సంపత్, రాజు, నారాయణ, శంకర్, రాజసాగర్ పాల్గొన్నారు.